క్లుప్తంగా

సరస్వతీ దేవికి పూజలు


జ్ఞాన సరస్వతి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఉపాలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి శుక్రవారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యర్రంపేటలో పొలంబడి


పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: యర్రంపేట గ్రామంలో ఏఓ పోసారావు పర్యవేక్షణలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీఎంఎంటీ కళ్యాణ్, మండల ఇన్‌చార్జి సంజీవరావు పాల్గొని ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ సాగు పద్ధతులు, విత్తన శుద్ధి, సాగు విధానం, సమగ్ర పోషణ యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, అంశాలపై అవగాహన కల్పించారు. పొలంబడిలో చేరండి సాధికారికత సాధించండి అంటూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పలువురి రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వారికి పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయాలి



కళాశాల పనులు పూర్తి చేయాలని నినదిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: అసంపూర్తిగా ఉన్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ. భూషణం, పీఓఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి తగరం బాబూరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పీఓఎల్, పీడీఎస్‌యూ బృంద సభ్యులు ఆ భవనాన్ని పరిశీలించారు. గత టీడీపీ హయాంలోనే రూ.కోటి నిధులు కేటాయించి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పీవోఎల్ డివిజన్ అధ్యక్షులు కె.పోతురెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు బన్నే వినోద్, జిల్లా కోశాధికారి, టి.ప్రశాంత్, డి.ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ వేలేరుపాడు మండల కమిటీ నియామకం

వేలేరుపాడు: వైఎస్సార్‌సీపీ వేలేరుపాడు మండల కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ మండల ఉపాధ్యక్షులుగా గుడ్డేటి వెంకట రాజ భాస్కర్, కేదారి సత్తిరాజు, ప్రధాన కార్యదర్శులుగా కురిమెల్ల రమేష్, మాలశెట్టి వేదకుమారి, బద్దే కృష్ణ, రుక్మిణి, కార్యదర్శులుగా సొందె భద్రయ్య, కరాటం భద్రయ్య, కుంజ అప్పారావు, అల్లిమిల్లి మహేష్, ఆకుల రామారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మడకం వెంకటేష్, కె.వేణు, మడకం వెంకమ్మ, మడకం మౌళి, కుంజా బుజ్జి, కుంజా శ్రీరాములు, జార్జి భిక్షం, కారం సీతారాములు, జొన్నల ఏలేశ్వరరావు, మెండెం రత్నంరాజు, ఎస్‌కే అఫ్రోజ్, బాడిస పాపారావు, మడకం వెంకటేష్, పోచారపు కృష్ణ, నూపా చంద్రయ్య, సొందె నర్సయ్య, పులి శివ, పుట్టి సుబ్బయ్య, చింత పోసి, ఎండీ మోసిన్‌ఖాన్‌లు నియమితులయ్యారు. నూతన కమిటీకి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు, స్థానిక పెద్దలు అభినందనలు తెలిపారు.

నూతన వాహనం ఆవిష్కరణ


షైన్ 100డీఎక్స్ వాహనాన్ని ఆవిష్కరించిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

జంగారెడ్డిగూడెం: హోండా కంపెనీ నూతనంగా లాంచ్ చేసిన షైన్ 100 డీఎక్స్ ద్విచక్ర వాహనాన్ని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక పవన్ హోండా షోరూమ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. షోరూమ్ యజమాని చిన్ని హరీష్ గుప్తా పాల్గొన్నారు.

విజేతలకు నగదు, ప్రశంసలు

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహనకు 5కె మారథాన్ ర్యాలీ విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలను కె.వెట్రిసెల్వి అందించి అభినందించారు. ఎయిడ్స్ బాధితులకు ప్రేమా ఆప్యాయతలను పంచాలని సూచించారు. అధికారులు పీజే అమృతం, కేఎస్ ప్రభాకరరావు, ప్రభాకర్, నరేంద్ర, జి.ఆదిలింగం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- తహసీల్దార్లకు వినతి


జంగారెడ్డిగూడెం : తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: తక్షణమే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి యూవీఎస్ రాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా రెండో తహసీల్దార్ స్లీవజోజికి వినతిపత్రం అందజేశామన్నారు. మండల అధ్యక్షులు ఐవీరత్నం, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, డీఆర్‌పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. నాయకులు వీవీ ప్రసాద్, కె.సుబ్బారావు, రామిరెడ్డి, హరినాగ్, విలియమ్స్, రామకృష్ణ, ధర్మరాజు, లలితాదేవి, సుభాషిణి, సాయిశ్రీ, ఉష తదితరులు పాల్గొన్నారు.

డీఏలను మంజూరు చేయాలి

కొయ్యలగూడెం: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, ఐఆర్ వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకులు ఆందోళన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా, ఆందోళన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. 17వ తేదీ వరకు నిరసన వారం కొనసాగుతుందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డి దొర మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రధాన డిమాండ్లను అంగీకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ దొరబాబు, జిల్లా కార్యదర్శి జేఎస్ శాస్త్రి, మండల ప్రధాన కార్యదర్శి వై.వీరభద్రయ్య, మండల శాఖ సబ్ కమిటీ సభ్యులు జిల్లా కౌన్సిలర్లు ఎస్.గోపీశ్రీనివాస్, ఎం.శోభనాద్రి, కె.శ్యాంబాబు, ఎస్.రమేష్, గురవరాజు, డి.సత్యనారాయణ, ఎన్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : వినతి పత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు


లింగపాలెం : తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

తహసీల్దార్‌కు వినతి

లింగపాలెం: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర ఏపీటీఎఫ్ పిలుపు మేరకు నిరసన వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. తహసిల్దార్ నజీముల్లాకు వినతి పత్రం అందజేశారు. నాయకులు బుల్ల అప్పల స్వామి, నగరం శ్రీనివాసరావు, తోట సతీష్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల రణభేరి పోస్టర్ విడుదల


రణభేరి పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

చింతలపూడి : ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్రమంతటా నిర్వహించే రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం చింతలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్, యర్రగుంటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు రణభేరి పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ఈనెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభలో ఉపాధ్యాయుల సత్తా చూపుతామని అన్నారు.

కార్మికులకు బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం

కుక్కునూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కుక్కునూరులో శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. నూజివీడులో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు.

మహిళా సర్పంచ్‌కి అదనపు బాధ్యతలు

కొయ్యలగూడెం: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యురాలిగా మండలంలోని రామానుజపురం గ్రామ సర్పంచ్ అడపా నాగలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

కుక్కలకు వ్యాక్సిన్లు


కుక్కలకు వ్యాక్సిన్ చేస్తున్న పశువైద్యుడు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో వీధి కుక్కలకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ల ప్రక్రియ శుక్రవారం చేపట్టారు. పశువైద్యాధికారుల పర్యవేక్షణలో కుక్కలకు వ్యాక్సిన్ చేసి వదిలివేస్తున్నట్టు సెక్రటరీ కె.సురేష్ తెలిపారు. నాలుగు రోజులపాటు ఈ కార్యక్రమ అమలు చేస్తున్నామని అన్నారు.

22 నుంచి దసరా ఉత్సవాలు


ఆహ్వాన పత్రిక విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఉత్సవాల కరపత్రం విడుదల చేశారు. 22న స్వర్ణవర్ణ పూర్ణకవచాలంకృత అలంకరణలో, 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాని, 26న మహాలక్ష్మి, 27న లలితా త్రిపుర సుందరీ దేవి, 28న మహాచండీ, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, సెప్టెంబర్ 1న మహిషాసుర మర్దిని, 2న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో అమ్మవారు పూజలందుకోనున్నట్లు చెప్పారు. 3న తేదీ భగవద్గీత పారాయణం, 4న రుద్రాభిషేకం, 5న గోపూజ, 6న చండీహోమం, మహాపూర్ణాహుతి, అన్నప్రసాత వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తొలి రోజు నూకాలమ్మ ఆలయం నుంచి శోభాయాత్రగా గంగానమ్మ వారికి సారె సమర్పించనున్నట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం వాసవీమాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవ కరపత్రాన్ని ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు విడుదల చేశారు. 11 రోజుల పాటు అమ్మవారిని వివిధ రకాల అలంకరణలో పూజిస్తామన్నారు. సెప్టెంబర్ 4న అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో టీవీపీ రామతారకం, సీహెచ్ఆర్, బి.రాంబాబు, వి.వెంకటేశ్వరరావు, కె.సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థుల సత్తా


పోటీల్లో గెలుపొందిన పంగిడిగూడెం విద్యార్థినులు

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ చేపట్టిన కళా ఉత్సవ్ – 2025 జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు దూబచర్లలోని డైట్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులతో పాటు, మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని, ప్రతిభను కనబరిచారు. జిల్లాస్థాయి జానపద గీతాల పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఎ.శృతి, పి.లక్ష్మి, కె.అర్చనశ్రీ, షేక్ నస్రీన గెలుపొందారు. విజువల్ ఆర్ట్స్ 2డిలో ఎం యశ్వంత్ తృతీయ బహుమతిని సాధించాడు. వీరికి తెలుగు ఉపాధ్యాయురాలు జి.నీలిమ, డ్రాయింగ్ టీచర్ టి.సుబ్బారావులు శిక్షణ ఇచ్చారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు ఎం కౌసల్యాదేవి, ఎస్ఎంసీ చైర్మన్ మద్దాల రాజు అభినందించారు.

కంటి వైద్య శిబిరం

పోలవరం రూరల్: కృష్ణారావుపేట సొసైటీ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్యులు పి.శిరీష ఆధ్వర్యంలో 158 మందికి కంటి పరీక్షలు చేయగా, వీరిలో 133 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. 9 మందిని శస్త్రచికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రమ ఆసుపత్రికి తరలించారు. శిబిరంలో తహసీల్దార్ బీవీఎస్ రాజు, సొసైటీ అధ్యక్షులు కొణతాల ప్రసాద్, సెక్రటరీ డి.దుర్గాప్రసాద్, గుణపర్తి చిన్న పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎంపీ

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని విశాఖ ఎంపీ మతుకుమిల్లి భరత్ శుక్రవారం సందర్శించారు. ఆయతో పాటు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఉన్నారు. వారు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. శ్రీవారి దివ్య క్షేత్రాన్ని రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అధికారి కట్టా సింహాచలం (ఐఏఎస్) కుటుంబ సమేతంగా సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

పంచాయతీ భవనం నిర్మించాలని వినతి


ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కనకాద్రిపురం గ్రామస్తులు

కొయ్యలగూడెం: కనకాద్రిపురం గ్రామంలో పంచాయతీ భవనం నిర్మించాలని ఆ గ్రామ ప్రజలు శుక్రవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సచివాలయాల వల్ల తమ గ్రామాన్ని 7 కిలో మీటర్ల దూరంలో ఉన్న గంగన్నగూడెం వెళ్లటం భారంగా ఉందని పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 8న గ్రామసభలో కనకాద్రిపురం గ్రామస్తుల అభిప్రాయం తీసుకోకుండా తీర్మానం చేయటం చట్ట విరుద్ధమని వివరించారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా గ్రామ పంచాయతీని కనకాద్రిపురం నుంచి కుంతలగూడెం తరలించటం వల్ల న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో వెలగందుల ధర్మరాజు, టెక్కిన తిరుపతయ్య, దుగ్గిరాల పెద్దిరాజు, వెంకటేశ్వరరావు, నలమాటి సత్యభామ, ఎల్లిబోయిన లక్ష్మి, కామాక్షి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా సరిపడా అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రరావు

కుక్కునూరు: రైతులకు యూరియా సరిపడా అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యర్రంశెట్టి నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కుక్కునూరు సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నాగేంద్రరావు మాట్లాడారు. మండలంలోని రైతులకు యూరియా సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారని, పంటల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారని వాపోయారు. ఉపాధి పనులు చేసి నాలుగు నెలలు గడిచినా కూలీలకు ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బయ్యన శ్రీను, యర్నం సాయికిరణ్,పులదాసు రమేష్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన 'కూటమి'


నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికలకు ముందు అధికారంలోకి రావటానికి కూటమి నాయకులు ఆటో, మోటార్ కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యూవీ), జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావులు డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక జూట్ మిల్లు సెంటర్లో ఆటో కార్మికుల నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూవీ, బద్దాలు మాట్లాడుతూ మోటార్ కార్మికులపై పెనాల్టీలు విధించే జీఓ 21 రద్దు, వాహన మిత్ర సాయం రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు పెంపు, సంక్షేమ బోర్డు ఏర్పాటు వంటి ఎన్నికల హామీలను కూటమి నాయకులు గాలికి వదిలేశారని వారు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వటానికి తాము వ్యతిరేకం కాదని, దాని వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం సభలో వాహన మిత్రను రూ.10 వేలు నుంచి రూ.15 వేలకు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ, వాహన మిత్ర అమలు చేసే కార్మికుల సంఖ్యను దారుణంగా తగ్గించేశారని, సొంత ఆటో డ్రైవర్లకు మాత్రమే ఇస్తానని చెప్పటం ద్వారా లక్షలాదిమంది కార్మికులకు వాహన మిత్ర ఫలితం అందదని వాపోయారు. ఈ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 18న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఏలూరు గూడ్స్ షెడ్ ఆటో కార్మిక సంఘం ప్రెసిడెంట్ పి.మహేష్, సెక్రటరీ కె.శివ, కమిటీ సభ్యులు బి.మురళి, ఆర్ పూర్ణ, ఎస్.శ్రీనివాస్, పి.వెంకటేష్, పి.పెద్దిరాజు, జి చిన్నా పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్‌పై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

జంగారెడ్డిగూడెం: రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల త్వరగా సంక్రమించే వ్యాధుల్లో టీబీ ఒకటని ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాంబాబు అన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీబీ ముక్త్ భారత్, మానసిక ఆరోగ్యం, విద్యార్థుల బలవన్మరణాలను నిర్మూలనపై ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్ బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో రాంబాబు మాట్లాడారు. టీబీ నివారణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగనిరోధక శక్తిని పెంచుకునేందుకు ముఖ్యంగా శారీరక ఆరోగ్యం పెంచేలా వ్యాయామం చేయాలని, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, సమయానికి నిద్రపోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేయాలని అన్నారు. సదస్సులో టీబీ హెల్త్ విజిటర్ సోనీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన అదనపు ఎస్పీ, డీఎస్పీ

ఏలూరు టౌన్: స్థానిక శనివారపుపేట ప్రభుత్వ వసతి గృహాన్ని ఏలూరు మహిళా స్టేషన్ సీఐ, శక్తి టీమ్ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఒక్కో బాలుడు, బాలికను వారి కుటుంబ విషయాలపై ఆరా తీస్తూ ఉండగా, ఒక బాలుడు తన ఇంటి అడ్రస్, తల్లిదండ్రుల పేర్లు చెప్పడంతో వెంటనే స్పందించిన సీఐ సుబ్బారావు ఆచూకీ తెలుసుకున్నారు. బాలుడ్ని అప్పగించటంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేవు. ఆ వివరాలను అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వెల్లడించారు. వసతి గృహంలో ఉన్న ఇబ్రహీమ్ అనే బాలుడు హైదరాబాద్ బోరబండ రైల్వేస్టేషన్ సమీపంలో చాంద్‌బీ మసీదు వద్ద ఉంటామని, తండ్రి పేరు అక్రమ్ అని చెప్పాడు. పోలీసులు బాలుడు చెప్పిన అడ్రస్‌ను ట్రేస్ చేసి తల్లిదండ్రులను గుర్తించారు. రెండేళ్ల క్రితం బాలుడు ఇంటినుంచి బిస్కెట్ కోసమని బయటకెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. ఈ కేసును అల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి క్రైమ్ నెంబర్ 170/2023గా నమోదు చేశారని అక్కడి పోలీసులు స్పష్టం చేశారు. హైదరాబాద్ అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, బాలుడు తల్లిదండ్రులు ఏలూరు రాగా వారికి ఇబ్రహీమ్‌ని అప్పగించారు.

16న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ సూచనల మేరకు జిల్లాస్థాయి వారధి ఇండియా ఫౌండేషన్ పోటీలు ఈనెల 16న మంగళవారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని ఈదర సుబ్బమ్మ దేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు జిల్లా సైన్స్ అధికారి ఎస్‌వీఎస్ సోమయాజులు తెలిపారు. ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డిబేట్‌లలో ప్రథమ స్థానం పొందిన టీం సభ్యులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వాట్ రోల్ షుడ్ స్కూల్స్ ప్లే ఇన్ ప్రమోటింగ్ మెంటల్ హెల్త్ లేదా వాట్ ఆర్ ది త్రీ మోస్ట్ ఇంపార్టెంట్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆఫ్ ద యూఎన్ ఇన్ ద కాన్‌టెక్స్ట్ ఇండియా అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. సోషల్ మీడియా ఈజ్ ఏ యూజ్‌ఫుల్ టూల్ ఫర్ స్టూడెంట్ లెర్నింగ్ లేదా సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఆఫ్ ద యూఎన్ ఆర్ నాట్ రిలవెంట్ టూ ఇండియాస్ డెవలప్‌మెంట్ అనే అంశంపై జిల్లా స్థాయి డిబేట్ పోటీలు ఉంటాయని వివరించారు. పై అంశాలలో టీం సభ్యులు ఏదో ఒక అంశాన్ని ఎన్నుకోవచ్చునన్నారు.

వృద్ధుల సంక్షేమానికి చర్యలు


వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. వయోవృద్ధుల పట్ల చోటుచేసుకుంటున్న దారుణ సంఘటనలు, అమానుష ఘనటలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాలు ఉన్నా ఎవరూ పట్టించుకోవటం లేదని, బాధితులకు న్యాయం జరగటంలేదని కోరారు. దీనిపై అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ వృద్ధులపై దాడులు, దౌర్జన్యాలు, కుటుంబ సభ్యుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో చైతన్యం రావాలని, ప్రతి వ్యక్తి తమ తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమ అప్యాయతతో ఉండాలనే భావన పెరగాలని అన్నారు. వృద్ధులకు సంబంధించి మెయింటినెన్స్, వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007, ప్రొటెక్షన్ ఆఫ్ విమెన్ ఫ్రమ్ డొమెస్టిక్ వయోలెన్స్ యాక్ట్ 2005 (వృద్ధ మహిళలకు) సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ 14567 విధిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వృద్ధులు సురక్షిత జీవనాన్ని గడిపేందుకు ఇలాంటి చట్టాలు దోహదపడతాయని తెలిపారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఉంటుందని, వారి కుటుంబాలకు సైతం ఎప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. మృతిచెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రరావు సతీమణి గౌరమ్మ, కుమారుడు శ్రీకాంత్‌కు కోఆపరేటివ్ నుంచి వచ్చిన రూ.1,02,413 చెక్కు రూపంలో ఎస్పీ శివకిషోర్ శుక్రవారం అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు సకాలంలో అందేలా కృషి చేస్తామని ఎస్పీ భరోసా కల్పించారు.

ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ విద్య అవసరం

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలని సెట్‌వెల్ సీఈఓ కేఎస్ ప్రభాకర రావు అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణలో 35వ బ్యాచ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం స్థానిక అన్నే భవనంలో నిర్వహించారు. 25 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.